క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను గుణదల లోని ఆయన కార్యాలయంలో పార్టీ మండల నాయకుడు దండు సుబ్రహ్మణ్యంరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ కార్యకర్తలతో సమావేశాలను నిర్వహించాలని దేవినేని అవినాష్ సూచించారు. కార్యకర్తలకు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి



పెనమలూరు: రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకొని ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డు (యుఐడీ) పొందాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె సోమవారం వివరాలు తెలుపుతూ వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ చేయటానికి (డిజిటల్ ఎగ్రికల్చర్ మిషన్) రైతులను గుర్తించటానికి గుర్తింపు కార్డులు (యూఐడీ) జారీ చేస్తుందన్నారు. సొంత భూమి కలిగిన రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్, ఆధార్ లింకు అయిన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇలా రైతులు పేర్లు నమోదు చేసుకోవటం వలన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట కనీస మద్దతు ధర, పంటల రుణాలు, వివిధ పథకాలు, ఇతర సేవలు రైతులకు ప్రభుత్వం నుంచి అందుతాయన్నారు. సొంత భూమి ఉన్న రైతులు 15 రోజుల లోపు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

విస్తృతంగా విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



ఉయ్యూరు: ఉయ్యూరు రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందం సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించింది. 23 బృందాలుగా ఏర్పడి 1841 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 267 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.6.96 లక్షల అపరాధ రుసుముగా విధించి ఆయా సర్వీసుల వినియోగదారులకు నోటీసులు జారీ చేశారు. విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్, విజిలెన్స్ ఈఈ సిహెచ్ వాసు, డీఈఈలు హేమకుమార్, శివనాగేశ్వరరావు, సుబ్రమణ్యేశ్వరరావు, విజిలెన్స్ ఏఈ షేక్ షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి తిరునాళ్ల ప్రారంభం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బిళ్లనపల్లిలో అంకమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సాయి వేణుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రాతఃకాలార్చన, గంగా స్నానం నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష అభిషేకాలు, కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం మారెమ్మ తల్లిని గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబురావు, మోహన్‌కుమార్, హేమంత్ కుమార్, తులసీరామ్, చలసాని మహేష్, గుళ్లపల్లి సుమన్ కుమార్ పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం

ఉయ్యూరు: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు, దేవాలయ పరిరక్షణ ఉద్యమనేత రంగరాజన్‌పై దాడి దుర్మార్గమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ దివి చిన్మయ అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

పోరంకి రామాలయానికి భక్తుల విరాళం



పెనమలూరు: పోరంకి గ్రామంలో పునఃనిర్మాణం చేసిన సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత కోదండరామాలయానికి భక్తులు విరాళం ఇచ్చారు. గ్రామంలో సోమవారం ఆలయ నిర్వాహకులకు బోడె వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి దంపతులు రూ.5,00,001 లక్షలు, కర్లపూడి జ్యోతి రూ. 1,00,116 లక్ష, వీర్ల సుబ్బారావు, నాగలక్ష్మి రూ.1,00,116 లక్షలు విరాళం ఇచ్చారు. ఆలయ దివ్యవిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 13వ తేదీన జరగనుంది. ప్రస్తుతం పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తున్నారు.

అంబాపురంలో సమస్యల కొలువు

- కనీస వసతులు కరువు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- మంచినీళ్లు కొనుగోలు చేస్తున్న వైనం




వెలగని వీధిలైట్లు

విజయవాడరూరల్: విజయవాడ నగరాన్ని ఆనుకొని వున్న అంబాపురం గ్రామంలో సమస్యలు కొలువుదీరాయి. కనీస వసతులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అంతర్గత రహదారులు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించకపోవడంతో ప్రజలు అనుభవిస్తున్న బాధలు అంతా ఇంతా కాదు. ఒకటో వార్డులో నివసించే ప్రజానీకం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామాల్లో సదుపాయాలు కల్పించి ప్రజలు సుఖంగా జీవించడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు ఇక్కడ ప్ర లను పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. దాదాపు 3,500 కుటుంబాలు అనగా సుమారు పదివేల మంది జనాభా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. పైపులరోడ్డు నుంచి జక్కంపూడి వెళ్లే మెయిన్ రోడ్డు తప్ప మౌలిక సదుపాయాలు మచ్చుకైనా కనిపించవు. మురుగునీరు పారేందుకు కనీసం అవుట్‌లెట్ కూడా లేదు. దీంతో ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. దీంతో దోమలు ఉధృతంగా ఏర్పడి అనేక వ్యాధులకు కారణమవుతున్నాయి. మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ పేరుతో నిర్వహించే స్వచ్ఛతాహీ పేర స్పెషల్ శానిటేషన్ పనులు అక్కడ జరగడం లేదు. కనీసం శానిటేషన్ సిబ్బంది కూడా రావడం లేదని స్థానికులు చెబుతున్నారు.పేరుకు మాత్రం 10 అంతర్గత రోడ్లు ఉన్నాయి. ఏ రోడ్డు చూసినా నడవడానికి వీల్లేని పరిస్థితిలో ఉన్నాయి. ఒక్క రోడ్డుకూడా అభివృద్ధికి నోచుకోలేదు. ఇళ్లు నిర్మించుకునే వారి వద్ద నుంచి ప్లాను పేరుతో ఒక వార్డు సభ్యుడు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



రోడ్డు పక్కన చెత్త కుప్ప



కాల్వలో కదలని మురుగునీరు

బోరు నీరే శరణ్యం....

నగరానికి అత్యంత సమీపంలో వున్న అంబాపురం గ్రామానికి తాగునీరు లేదు. బోరునీటితో స్థానికులు తమ అవసరాలను తీర్చుకొంటున్నారు. ప్రభుత్వ పరంగా కనీసం తాగునీరు కూడా సరఫరా చేయలేక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నారయి. ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల వద్ద 20 లీటర్ల క్యాను 15 రూపాయలకు కొనుగోలు చేసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో వీధి లైట్లు కూడా వెలగక స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆహ్వానం కళ్యాణ మండపం వెనుక వైపు నాలుగు వీధుల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు అంధకారంలో ఉంటున్నారు. అక్కడ నివసించే ప్రజానీకానికి ప్రభుత్వ వైద్య సేవలు కంటికి కనిపించవు. పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం కనీసం ఒక్క ఎలిమెంటరీ స్కూల్ కూడా లేని పరిస్థితిలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

మురుగుతో రోగాల భయం



తమ ప్రాంతంలో కనీస సదుపాయాలు లేవు. ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. రోగాల భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాము. ప్రతి రోజూ 20 రూపాయలు వెచ్చించి తాగునీరు కొనుగోలు చేస్తున్నాం. – సాయికుమార్

దోమలతో ఇక్కట్లు



కాల్వల్లో మురుగు నిల్వ దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రిళ్లు కంటిమీద కునుకు ఉండటం లేదు. దోమల నివారణకు గ్రామ పంచాయతీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పారిశుద్ధ్యం మెరుగుదలపై కనీసం దృష్టి పెట్టకపోవడం విడ్డూరంగా ఉంది. – గోపయ్య,అంబాపురం

చర్యలు తీసుకుంటాం



ఒకటో వార్డులో దోమల నివారణకు చర్యలు చేపడతాము. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి శానిటేషన్ చర్యలు ముమ్మరంగా చేస్తాం. డ్రైనేజీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. – డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి



ప్రొఫెసర్ డాక్టర్ బి.మహదేవన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెనమలూరు: భారత ప్రాచీనా సాంకేతిక నైపుణ్యంతో నేటి ఇంజినీరింగ్ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలని బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ (ఐఐఎం) ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మహదేవన్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో సోమవారం భారతీయ జ్ఞాన వ్యవస్థ ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల్లో భారతీయుల విశిష్టత అనే అంశం పై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతీయ జ్ఞాన వ్యవస్థ రుద్వేగం నుంచి విస్తరించి ఉందన్నారు. రాజులు నిర్మించుకున్న అనేక కోటలు, కరికాల చోళుడు తమిళనాడులో కల్లణై ఆనకట్ట నిర్మాణం, గణిత శాస్త్రంతో పాటు అనేక శాస్త్రాలు, శూన్యం (జీరో) ఆవిష్కరణ, భారతీయ సంఖ్యా పద్ధతుల ద్వారా అభివృద్ధి అయ్యాయన్నారు. ఇనుప స్తంభం (కుతుబ్‌మినార్), మొగల్‌కాలపు తుపాకులు చాలా ప్రాముఖ్యతను సాధించాయని వివరించారు. నేటి ఇంజినీరింగ్ విద్యార్థులు భారత ప్రాచీనా సాంకేతిక నైపుణ్యం పై అధ్యయనం చేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా బి.మహదేవన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రవిచంద్, పలు విభాగాధితులు, అధ్యాపకులు. విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ



పెనమలూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు



తెంపల్లిలో మాత్రలు అందజేస్తున్న సీడీపీవో వెంకటలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు



విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్ వేస్తున్న ఎంఈవో సూరిబాబు



కాటూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు



ఇందుపల్లిలో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు అందజేస్తున్న డాక్టర్ శిరీష

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు నులి పురుగుల నిర్మూలన టాబ్లెట్స్ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ఉపయోగపడతాయని తెలిపారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేశారు హైస్కూల్ హెచ్‌ఎం వి.భూపాల్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఏఎన్‌ఎమ్ లక్ష్మీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

1706 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

గన్నవరం రూరల్: బాలల్లో రక్తహీనత, పోషకాల లోపం నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని గన్నవరం ఐసీడీఎస్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని తెంపల్లి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగ మల్లేశ్వరరావుతో కలసి ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో, జడ్పీహైస్కూల్, ఎంపీపీ పాఠశాలల్లో మొత్తం 1706 మందికి మాత్రలు అందజేశారు. అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందులు వాడాలి

పెనమలూరు: చిన్నారులు నులి పురుగుల మందులు వాడితే ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి సాయిలలిత తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణకు మందు బిల్లలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఎంఎల్‌హెచ్‌పీలు షైనీప్రియ, భారతి, పీహెచ్ఎన్ లక్ష్మి, ఏఎన్‌ఎం లిల్లీపుష్పం, ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా ఉయ్యూరు పట్టణంలోని 20 వార్డుల్లో మండలంలోని 11 గ్రామాల్లో సోమవారం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది పాఠశాలలకు వెళ్లి మాత్రలను అందించారు. కాటూరు జెడ్పీ పాఠశాలలో ఎంపీడీఓ శేషగిరిరావు మాత్రలు పంపిణీ ప్రారంభించారు. నులి పురుగుల నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అందించారు. నులిపురుగులు వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపాలకు కారణమవుతాయని చెప్పారు. సర్పంచ్ పిల్లా అనిత, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ప్రణయ్ సాగర్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ

ఉంగుటూరు: నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఇందుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ బి.శిరీష అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆల్‌బెండజోల్ మాత్రలు సోమవారం పంపిణీ చేశారు. నులిపురుగులను నిర్మూలించడం వలన రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అదే విధంగా ఆత్కూరు, ఉంగుటూరు, పెద్ద అవుటపల్లి పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ ట్యాబ్‌లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాణి, మనోహర్ రెడ్డి, కరిముల్లా, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లి కుమార్తెగా లక్ష్మీతిరుపతమ్మ అలంకరణ



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



పెండ్లి కుమార్తె అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ మాతృమండలిచే గత 40 రోజులుగా జరుగుతున్న శ్రీలలితా సహస్రనామ పారాయణ మండలి దీక్షకు ముగింపు పలుకుతూ కలశ ఉద్వాసన పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామ పొంగళ్ళు సమర్పణ, ఆలయ ప్రాంగణంలోని మాను (మహాలక్ష్మి)కి భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీతిరుపతమ్మ మాతృ మండలి సభ్యులచే నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి 9 గంటలకు అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. పరిసర గ్రామాల భక్తులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఆలయం ఎదుట బోర్డు ఏర్పాటుపై వివాదం



ఆలయ కమిటీ నిర్ణయంతో పనిలేకుండా ఏకపక్షంగా ఏర్పాటు చేసిన బోర్డు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని గంగానమ్మ తల్లి ఆలయానికి ధర్మకర్తను తానేనంటూ జనసేన నేత టంకసాల సుబ్బారావు ఆలయ కమిటీ సభ్యుల నిర్ణయంతో పని లేకుండా తన పేరుతో బోర్డు ఏర్పాటు చేయడంపై వివాదం తలెత్తింది. ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉన్న గంగానమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధికి గ్రామంలో చాలా మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి అభివృద్ధికి కృషి చేశారు. అలాగే గ్రామ పెద్దలు, గ్రామస్తులు విరాళాలు అందజేశారు. కాగ ఈ ఆలయ అభివృద్ధికి కారణం తానేనంటూ టంకసాల సుబ్బారావు సొంత పెత్తనం ప్రదర్శించడాన్ని ఆలయ కమిటీ, గ్రామస్తులకు మింగుడు పడటం లేదు. ఆలయ కమిటీ ఎంపికైన ధర్మకర్త స్థానానికి మాత్రం జరగలేదు. దీంతో ఆలయ కమిటీ, గ్రామ పెద్దలను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ తానే ధర్మకర్తనంటూ సుబ్బారావు బోర్డును ఏర్పాటు చేయడాని పలువురు తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల9న ఆలయంలో జరిగిన ఆలయ కమిటీ సభ్యులు సమావేశంలో బోర్డు ఏర్పాటు అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆలయానికి ధర్మకర్త లేరని తానే ధర్మకర్తనని స్వయంగా ప్రకటించుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బోర్డు ఏర్పాటు అంశంపై వివాదం తలెత్తడంతో బోర్డును తొలగించడానికి ఆలయ కమిటీ నిర్ణయించింది.

గిరిజనులకు కిట్లు పంపిణీ



గిరిజనులకు కిట్లు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గన్నవరం రూరల్: విజయవాడ చిల్డ్రన్స్, స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ సింగ్‌నగర్ డివిజన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పరిసరాల్లోని నాలుగు మండలాల్లోని 45 గ్రామాల గిరిజనులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ సోమవారం వివరాలు తెలియజేసింది. శని, ఆదివారాల్లో రెండు గ్రూపులుగా ఏర్పడిన అసోసియేషన్ సభ్యులకు ఐటీడీఏ సహకారం అందించింది. 2150 మందికి దుప్పటి, చీర, లుంగీ, టవల్ కలిగిన కిట్లు అందజేశారు. రహదారులు కూడా సరిగాలేని గ్రామాలకు చేరుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐటీడీఏ అధికారులు సుబ్రమణ్యం, జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు, రేడియంట్ హైస్కూల్ స్టాఫ్, విద్యార్థులు సహకారంతో ఈ పంపిణీ విజయవంతం చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, గవరి్నంగ్ బాడీ కన్వీనర్ గోన సాంబశివరావు, సభ్యులు ఆరుమళ్ళ మోహన్‌రెడ్డి, షేక్ ఇమాం, గుండె స్లీవా, అవుతు మధుసూదన్ రెడ్డి, ఆరుమళ్ళ కనకదుర్గ, అవుతు అనురాధ, మాధవి, కుసుమ, ఫ్లోరెన్స్, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంటుమిల్లి మండలం గార్లగుంట గ్రామానికి చెందిన పాము మణికుమార్ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తాడు. ఆయన ఆదివారం తన బైక్ పై విజయవాడకు వస్తుండగా గోసాల వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణికుమార్ బైక్ పై నుంచి రోడ్డు పై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడి తండ్రి పాము జేమ్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం



వెండి గిన్నెలు అందజేస్తున్న పాలడుగు, కొమ్మరాజు

గన్నవరం: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ గత ఆరు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా పనిచేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్, గన్నవరం పాల కేంద్రం అధ్యక్షుడు పాలడుగు వెంకట రామవరప్రసాద్ (నాని) తెలిపారు. స్థానిక పాతగన్నవరంలోని పాలకేంద్రంలో కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాల్లో భాగంగా పాడి రైతుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల సొసైటీ మాజీ అధ్యక్షులను సత్కరించడంతో పాటు 61 మంది పాడి రైతులకు వెండి గిన్నెలను బహూకరించారు. అనంతరం పాలడుగు మాట్లాడుతూ...1965లో ప్రారంభమైన కృష్ణా మిల్క్ యూనియన్ గత 60 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం రాష్ట్రంలోనే అతిపెద్ద పాల సేకరణ సంస్థగా ఎదిగిందన్నారు. యూనియన్ ఈ స్థాయికి చేరడానికి మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం, మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య, ప్రస్తుత చైర్మన్ చలసాని ఆంజనేయులు కృషి మరువలేనిదన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కాసరనేని రంగబాబు, ఏజీఎం చల్లా అన్వేష్, రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ వద్దని నిరసన

- చోడవరం ఇసుక క్వారీపై గ్రామస్తుల ఆందోళన
- గ్రామసభలో అధికారులకు చుక్కెదురు
- నీళ్లు నమిలిన అధికారులు
- గ్రామంలో ఉద్రిక్తత



గ్రామసభలో ప్రసంగిస్తున్న ఈఈ

పెనమలూరు: చోడవరం గ్రామం కృష్ణా నదిలో ఇసుక క్వారీ ప్రారంభించటానికి ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామస్తులు ఎదురు తిరగటంతో అధికారులకు చుక్కెదురయింది. గ్రామస్తులకు తెలియకుండా ఇసుక క్వారీ ప్రారంభిస్తే ధర్నాలు చేస్తామని, కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని గ్రామస్తులు అధికారులకు తేల్చి చెప్పారు. చోడవరం గ్రామ పరిధి కృష్ణానదిలో 7 హెక్టార్లలో ఇసుక క్వారీ తెరిచి 70 వేల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలకు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామ సభ నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ గోపాలకృష్ణ గ్రామసభ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ చోడవరం గ్రామ పరిధి కృష్ణానదిలో ఇసుక క్వారీ ప్రారంభిస్తామని తెలిపారు. దీంతో సభకు వచ్చిన గ్రామస్తులు ఒక్కసారిగా నిరసన గళం విప్పారు. దీంతో అధికారులు కంగుతిన్నారు.

ఇసుక క్వారీ వద్దు...

గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఇప్పటికే కృష్ణా నదిలో అక్రమంగా ఇసుక దోచేశారని ఆరోపించారు. భూగర్భ జలాలు అట్టడుగి పోయాయని తెలిపారు. భవిష్యత్తులో తాము పంటలు ఎలా సాగు చేయగలుగుతామన్నారు. గతంలో సుప్రీం కోర్టు క్వారీని నిలుపుదల చేసిందన్నారు. గతంలో క్వారీ తవ్విన వారి పై పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. క్వారీ పై నిషేధం ఉన్నా కొందరు స్వార్థపరులు గత 9 నెలలుగా అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఏమి ఎరగనట్లు ఇప్పుడు వచ్చి గ్రామసభ ఎలా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక నివరించాల్సిన రెవెన్యూ, పర్యావరణ, ఇతర శాఖ అధికారులు ఏమయ్యారని నిలదీశారు. అధికారులు సర్ది చెప్పే యత్నం చేయగా గ్రామస్తులు ససేమిరా అన్నారు. గ్రామస్తులకు తెలియకుండా కృష్ణానదిలో ఇసుక క్వారీ ప్రారంభిస్తే ఆందోళన చేపడతామని, న్యాయపోరాటం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. కాగా ఎన్నికల కోడ్ ఉండగా అధికారులు ఎలా గ్రామసభ నిర్వహిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండి పడ్డారు. చేసేది లేక అధికారులు వచ్చిన దారిన వెళ్లారు.